క్లుప్తంగా

రాయితీతో వరి విత్తనాలు

సైదాపురం: వర్షాలకు వరినారుమళ్లు దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీతో వరి విత్తనాలను అందజేస్తున్నట్లు ఏఓ హైమావతి తెలిపారు. ఆమె సోమవారం లింగసముద్రం ఆర్బీకేను పరిశీలించారు. కలిచేడు, తుమ్మలతలుపూరు, దేవరవేమూరు గ్రామాల్లో నీట మునిగిన వరినారుమడులు, వరి నాట్లను పరిశీలించామన్నారు. 90 శాతం నీరు బయటకు పంపిన తర్వాత 5 సెంట్లు నారుమడికి కేజీ యూరియా, కేజీ పొటాష్ వేసుకోవాలన్నారు. సర్పంచ్ వరప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

సైదాపురం: మండలంలోని కలిచేడు, తురిమెర్ల గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రభాత సేవా సమితి ప్రతినిధులు విస్తృతంగా ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య, సభ్యులు కొండయ్య, కృష్ణయ్య, గాయత్రి, పద్మమ్మ, శేషాద్రి, నరసారెడ్డి, భాగ్యమ్మ, గోపి, కార్తీక్, కిరణ్, సునీత, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష దీపోత్సవం

చిట్టమూరు: మండలంలోని మల్లాంలో కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం లక్ష దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ చిల్లకూరు సాయికుమార్ రెడ్డి తెలిపారు. కార్తీక మాసం చివరి రోజు, కార్తీక బహుళ అమావాస్యను పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు శాంతి కల్యాణం, పుష్ప యాగం చేస్తామన్నారు. సాయంత్రం ఆరు గంటలకు లక్ష ఒత్తులతో లక్ష దీపోత్సవం, కామాక్షీదేవి సమేత కోమలేశ్వర స్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి శాంతి కల్యాణం చేపడతామని చెప్పారు. రాత్రి సామూహిక వన భోజన కార్యక్రమం ఉంటుందన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



గూడూరు రూరల్: గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మనపాటి శ్రీనివాసులు దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీనా మాట్లాడుతూ ప్రతి గర్భిణీ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆకు కూరలు, కూరగాయాలతో పాటు పాలు, గుడ్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజా, జేవీవీ నాయకులు నాగరాజు, చెంచునారాయణ, ప్రభాకర్, ఇబ్రహీం, బాబు జగదీష్, సాయి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

పరామర్శ


సేతరాసి బాలయ్యను పరామర్శిస్తున్న కౌన్సిలర్లు

వెంకటగిరి(సైదాపురం): మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య శస్త్ర చికిత్స చేసుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జి.ఢిల్లీబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, చంద్రశేఖర్, సుబ్బారావు, నేతలు సీహెచ్ మురళీ, శ్రీనివాసులు పరామర్శించారు.

స్కానర్‌తో ఇంటి పన్నుల వసూలు



సూళ్లూరుపేట రూరల్: మండలంలోని పంచాయతీల్లో పేటీఎం స్కానర్ ద్వారా ఇంటి పన్నులు వసూలు చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. కేసీఎన్‌గుంట పంచాయతీ పరిధిలోని ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఈవో పీఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శి సుధీర్, సచివాలయ సిబ్బంది సోమవారం డిజిటల్ స్కానర్ ద్వారా 50 శాతం ఇంటి పన్నులు వసూలు చేశారు. ఇక నుంచి ఇంటి పన్నులను పేటీఎం స్కానర్, డిజిటల్ పేమెంట్ల ద్వారా కట్టించుకుంటున్నట్టు తెలిపారు.

పల్లికొండేశ్వరుడికి ప్రత్యేక పూజలు

నాగలాపురం: మండలంలోని సర్వమంగళ సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శివజ్ఞాన గురుశ్రీ కూణం పట్టి కల్యాణపురి ఆధీనంలో 57వ శ్రీగురు రాజశరవణ మాణిక్య వాసగ పరమాచార్య స్వామి ఆధ్వర్యంలో మాణిక్య వాసగర్ ఉత్సవమూర్తి ప్రతిష్ట ఘనంగా జరిగింది. అలాగే తిరువాచకం పుస్తకాన్ని ప్రతిష్టించిన అనంతరం యాగశాలలో ఏకాదశి రుద్ర హోమం నిర్వహించారు. సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

సంక్షేమ పథకాల సారథి సీఎం జగన్


బాలాయపల్లి : మన్నూరులో మాట్లాడుతున్న ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి


బొజ్జనపల్లిలో వలంటీర్లకు కిట్లు అందజేస్తున్న దయాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి

బాలాయపల్లి (డక్కిలి): ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ సంక్షేమ పథకాల సారథిగా నిలిచారని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్ రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బాబి చౌదరి తెలిపారు. వారు సోమవారం మన్నూరు సచివాలయం పరిధిలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం మన్నూరు సచివాలయం పరిధిలో నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వలంటీర్లకు మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అర్చన, వైఎస్సార్‌సీపీ నాయకులు కిషోర్‌రెడ్డి, కాటూరు ప్రసాద్‌రెడ్డి, మాళిరెడ్డి, శరణ్, జనార్దన్ క్రిష్ణవేణి పాల్గొన్నారు.


వెంకటగిరి రూరల్ : వలంటీర్లకు కిట్లు అందజేస్తున్న దొంతు శారద, ఆరి శంకరయ్య

అభివృద్ధి కోసం జగన్ కావాలి

రాపూరు: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి తెలిపారు. బొజ్జనపల్లి సచివాలయంలో సోమవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం చేపట్టారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వలంటీర్లకు మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, కృష్ణారెడ్డి, కలపాటి మధురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరసింహారెడ్డి, వెంకటసుబ్బయ్య, మురళీమోహన్‌రెడ్డి, రమణారెడ్డి, ఎంపీడీవో అప్పాజి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన చారిత్రాత్మకం

వెంకటగిరి రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చారిత్రాత్మకమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. పట్టణంలోని సుదర్శనం నగర్‌లో సోమవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వలంటీర్లకు మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, కౌన్సిలర్లు సుభావలి, ఎంఏ నారాయణ, శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలని నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

నాయుడుపేట: మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం వద్దగల చక్కెర కార్మాగారంలో పనిచేసిన కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ కార్మికులు కోరారు. వారు సోమవారం పరిశ్రమ ముందు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 250 మంది కార్మికులు 1990 నుంచి 2018 వరకు చక్కెర పరిశ్రమలో పనిచేశామన్నారు. ఫ్యాక్టరీ దివాలా తీయడంతో మూసేశారని, తమకు రావాల్సిన బకాయిలు, పరిహారం అందించాలని యాజమాన్యంకు విన్నవించామన్నారు. అలాగే ఫ్యాక్టరీస్ అధికారులకు తమ గోడును విన్నవించుకున్నా న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దువ్వూరు రవికుమార్, పురుషోత్తం నాయుడు, తిరుమలరావు, నరసయ్య, క్రిష్ణయ్య, సుబ్రమణ్యం, కుమార్, ప్రకాష్ పాల్గొన్నారు.

కండలేరులో 13.118 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 13.118టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 245 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం


విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న హెచ్ఎం

తడ: తడకండ్రిగ భవిత సెంటర్‌లో సోమవారం ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సురేష్, హెచ్ఎం సురేంద్ర, భవిత ఉపాధ్యాయులు కల్పన, ప్రియాంక, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప జ్యోతి మహోత్సవం


మేళతాళాలతో అయప్పస్వామి ఊరేగింపు

సూళ్లూరుపేట: పట్టణానికి చెందిన అయ్యప్ప స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి జ్యోతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. షార్ బస్టాండ్ సెంటర్‌లో వున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మహా భజన, మాలధారణ చేసిన స్వాములకు భిక్ష చేపట్టారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు అఖండ కర్పూర జ్యోతిని వెలిగించారు. తదుపరి స్వామి వారికి 18 పడికట్ల పూజను చేశారు. అయ్యప్పస్వామి భక్తబృందం వారు అయ్యప్ప జ్యోతుల ఉత్సవాలు చేపట్టి ఈ ఏడాదితో 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను మూడు రోజులు పాటు నిర్వహించారు. శనివారం అయ్యప్పస్వామికి నెయ్యితో అభిషేకం చేశారు. అయ్యప్ప భక్తబృందం సభ్యులు పాదర్తి రవీంద్రారెడ్డి, చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయం



రాపూరు: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో రాపూరులోని రామనాథేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చన, పూలంగి సేవ నిర్వహించారు. భక్తులు తెల్లవారు జామునే నదీ స్నానం చేసి శివుడిని దర్శించుకున్నారు. ఉపవాస దీక్షలు చేపట్టి సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించి ఉపావాస దీక్షను విరమించారు. మరి కొందరు కార్తీక నోములు నోచుకున్నారు.

భూమి పంపిణీ చేయాలని వినతి

చిల్లకూరు: తాను ఎన్నోఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూమిని సాగరమాల రోడ్డు ఏర్పాటుకు తీసుకుని ఇప్పటి వరకు పరిహారం కూడా ఇవ్వలేదని వలిపి వెంకటరమణయ్య వాపోయారు. ఆయన సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తాను బల్లవోల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని తెలిపారు. ఇటీవల సాగరమాలకు భూమిని తీసుకున్నారని తెలిపారు. పరిహారం కూడా ఇవ్వలేదని, తాను ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డానని వాపోయారు. అదేప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

స్పందన సమస్యలకు పరిష్కారం


ఆర్డీవోకు వినతి ప్రతం అందస్తున్న జేఎల్ఎంలు

గూడూరు రూరల్: స్పందనలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వాటిని ఆయా శాఖల అధికారులకు పంపి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుని నివేదిక అందజేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు జేఎల్ఎంలు ఆర్డీవోను కలిశారు. తమను సచివాలయ సిబ్బందిగా గుర్తించాలని కోరారు. ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

అనుమతులు లేకుండా తవ్వకాలు


మాట్లాడుతున్న రాఘవేంద్ర

చిల్లకూరు: గూడూరు రూరల్ పరిధిలోని చెన్నేరు సమీపంలో మంగళపూరు గ్రామానికి వెళ్లే మార్గంలో లీజులు కాలం చెల్లినా మైన్స్‌లో అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపడుతున్నారని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షుడు డేగా రవిరాఘవేంద్ర తెలిపారు. ఆయన సోమవారం చిల్లకూరులోని గనుల శాఖ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమంగా తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యక్షుడు వేగూరు విజయకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

కోట: గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న తపాలా ఉద్యోగులు మంగళవారం నుంచి సమ్మె చేపట్టనున్నట్టు ఏఐజీడీఎస్‌యూ అధ్యక్షుడు బండి గోపాల్ తెలిపారు. ఆయన సోమవారం విద్యానగర్ తపాలా కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను కేంద్ర పభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అంత వరకు పోరాటం ఆగదని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామీణ తపాలా ఉద్యోగులకు సహకారం అందించి సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

వరద బాధితులకు పరిహారం


నాయుడుపేట: పూదేరులో బాధితులకు పరిహారం పంపిణీ


నాయుడుపేట : మున్సిపాలిటీలో బాధితులకు పరిహారం అందజేస్తున్న కౌన్సిలర్

నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీలోని ఎస్ఎస్ఆర్ కాలనీలో సోమవారం కౌన్సిలర్ పాలేటి నాగార్జున వరద బాధితులకు 25 కేజీల బియ్యం, కందిపప్పు, నూనె తదితరాలు అందజేశారు. అలాగే మండలంలోని పుదేరు స్నేహపురి కాలనీ ప్రజలకు ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి సహాయం అందజేశారు.

వైఎస్సార్ బీమా అందజేత


నగదును అందజేస్తున్న చైర్ పర్సన్ దీపిక

నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీలోని భూపయ్యకాలనీ సచివాలయ పరిధిలోని నీలిశెట్టి తనూజకు రూ.10 వేలను మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక అందజేశారు. ఈనెల 3న నిర్మలజ్యోతి మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద నగదు అందజేశారు.

ఆర్థిక సాయం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన చేనేత కార్మికుడు పి.సుబ్రమణ్యం అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్‌వీఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత నక్కా వెంకటేశ్వర్లు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సుబ్రమణ్యం, వీరయ్య, బాలాజీ, ప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగులు దైవ స్వరూపులు


విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈవో

సూళ్లూరుపేట: దివ్యాంగులు దైవస్వరూపులని, వారికి సేవ చేయాలని ఎంఈవో కె.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వున్న భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను చిన్నచూపు చూడవద్దన్నారు. భవిత స్కూల్‌లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు రావాలని కోరారు. అనంతరం ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ప్రతినిధులు సిల్వర్ వాటర్ బాటిల్స్ అందజేశారు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఐఈఆర్టీలు వీటీ భార్గవి, ఎన్.సంధ్య, సీఆర్పీలు వేలూరు అంకయ్య, మహేష్, ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ప్రతినిధి మన్నెముద్దు చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధలయ్యకోనకు పోటెత్తిన భక్తులు


దీపారాధన చేస్తున్న భక్తులు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలో ఉన్న సిద్ధలయ్య కోనలో కార్తీక మాసం నాలుగో సోమవారం తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోర్కెలు తీరిన వారు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో కార్తీక దీపం వెలిగించారు. కోనలో ఉన్న నవకోటి, నవనాథుల సిద్ధలయ్య, వారి ప్రియశిష్యులు సారంగధరుడికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. ఒగ్గు కృష్ణయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు

డక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లిలో ఉన్న స్తంభాల గిరీశ్వరయ్య స్వామి, దగ్గవోలు నాగలింగేశ్వరస్వామి, వడ్ల మోపూరు శివాలయం, ఆల్తూరుపాడు, వెలికల్లు, వెంబులూరు ఆలయాల్లో సోమవారం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్తంభాలగిరీశ్వరయ్య స్వామి ఆలయంలో సోమవారం రాత్రి శివ పార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ఈవో శ్రీధర్‌నాయుడు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా నక్షత్ర దీపోత్సవం

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో ఉన్న కామాక్షిదేవి సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నక్షత్ర దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని ఆలయ అర్చకుడు గూడలి సుధీర్‌శర్మ చేపట్టారు. కార్తీక మాసం చివరి రోజు, అమావాస్య సందర్భంగా సైకత శివలింగాన్ని ఏర్పాటు చేసి భక్తులతో సామూహిక పుష్పాభిషేకం చేస్తున్నట్టు తెలిపారు. చెరువులో దీపాలు వెలిగించడం, ఆకాశ దీప దర్శన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాత్రి భక్తులకు అన్నదానం చేస్తామన్నారు.

నారుమడుల సంరక్షణకు సూచనలు

కలువాయి: మండలంలోని తెలుగురాయపురం, తోపుగుంట గ్రామాల్లో దెబ్బతిన్న నారుమడులను సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు విజయకుమార్ నాయక్, సి.మారుతీ దేవి, శైలజ పరిశీలించారు. వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారు మాట్లాడుతూ వరి నాటే ముందు మొముపిప్పి నివారణకు 3జి గుళికలు వేసుకోవాలని సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణకు నారు కొనలు త్రుంచి నాటుకోవాలని తెలిపారు. జొన్న పైరులో కత్తెర పురుగు నివారణకు ఇమామిత్ బెంజయేట్ 80 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో ప్రతాప్, వీఏఏ హజరత్ పాల్గొన్నారు.

నేడు దక్షిణ కాలువకు నీటి విడుదల

కలువాయి: సోమశిల జలాశయం నుంచి దక్షిణ కాలువకు మంగళవారం నీటిని విడుదల చేయనున్నట్లు ఆరో డివిజన్ ఈఈ మల్లికార్జున తెలిపారు. ఆయన సోమవారం దక్షిణ కాలువను పరిశీలించారు. విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో జరిగిన ఐఏబీ సమావేశంలో దక్షిణ కాలువకు నీటి కేటాయింపు జరగలేదన్నారు. తుపాను కారణంగా జలాశయంలోకి ఆరు టీఎంసీల నీరు అదనంగా వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో దక్షిణ కాలువకు 1 టీఎంసీల నీటిని కేటాయించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తర కాలువకు 2 టీఎంసీలు, కావలి కాలువకు 3 టీఎంసీలు, కనుపూరు కాలువకు 3 టీఎంసీలు కేటాయించినట్టు వివరించారు. దక్షిణ కాలువ కింద 5 ఎల్ డిస్ట్రిబ్యూటరీ వరకు నీటిని విడుదల చేస్తామన్నారు. తద్వారా 10,500 ఎకరాలు సాగులోకి వస్తాయని చెప్పారు. రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకుంటే మంచిదని, వరి సాగు చేయాలనుకుంటే సిద్ధంగా ఉన్న నారును నాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈలు సురేష్, అంకమ్మ, విజయబాబు, సుధీర్, ఏఈ నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి


బాలాయపల్లిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వెంకటరమణ

బాలాయపల్లి (డక్కిలి): పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణ ఆదేశించారు. ఆయన సోమవారం వెంగమాంబపురం, బాలాయపల్లి సచివాలయాల పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి వర్మీకంపోస్టు తయారీ చేయాలన్నారు. ప్రస్తుతం సీజన్ వ్యాధులు ప్రబలకుండా తాగునీటి బోర్లు, బావులు, కాలువల్లో బ్లీచింగ్, క్లోరినేషన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు జే లీలావతి, పీ దయాకర్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి


కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు


కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, నాయకులు

సైదాపురం: ఈ నెల15వ తేదీ నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు కోరారు. ఆయన సోమవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఆటల పోటీలను నిర్వహించేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. అదేవిధంగా సచివాలయాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ కుల గణనను పటిష్టంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగినేని శ్రీనివాసులు, ఎంఈవో దయాకర్ పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండలంలోని 13 గ్రామ సచివాలయాలకు సోమవారం ఆడుదాం ఆంధ్ర కిట్లను ఎంపీడీవో సురేష్‌బాబు పంపిణీ చేశారు. ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించిన కిట్లను సచివాయాలకు చేరవేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఓజిలిలో..

ఓజిలి: ఆడుదాం ఆంధ్ర కిట్లను సోమవారం పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లకు ఎంపీడీవో రజనీకాంత్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతీయువకుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్ర ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణారెడ్డి, జెడ్పీటీసీ రవీంద్రరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హరనాథ్‌రెడ్డి, నాయకులు బాబురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుబ్బరావుయాదవ్, ఖాదర్ బాషా, పంచాయతీ కార్యదర్శి రేణుక, సిరాజ్ బాషా, మస్తానయ్య పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు


ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు

సూళ్లూరుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధనం పొదుపు అనే అంశంపై వ్యాసరచన, పోస్టర్ విభాగంలో పోటీలు నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి.విక్టోరియా రాణి, ఫిజిక్స్ విభాగం ఓడీ వీ రాజా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ–బీఈఈ, 1991 నుంచి ప్రతి ఏటా డిసెంబర్ 14న జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇంధనం పొదుపు చేసే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

‘వరద బాధితులకు అండగా ఉంటాం’


చిల్లకూరు: ఉడతావారిపాళెంలో సరుకులు ఇస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

చిల్లకూరు: మండలంలోని వరద బాధితులకు సోమవారం ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు నిత్యావసర సరుకులు అందజేశారు. ఉడతావారిపాళెం పంచాయతీలో ఎంపీటీసీ సన్నారెడ్డి, చంద్రారెడ్డి, సర్పంచ్ పులివిజయమ్మ బాధితులకు బియ్యం, సరుకులు అందించారు. అలాగే వేళ్లపాళెం పంచాయతీ కాకువారిపాళెంలో సర్పంచ్ రావుల వెంకటేశ్వర్లు, ఓడూరు పంచాయతీలో సర్పంచ్ నాగిశెట్టి శారదమ్మ బియ్యం, సరుకులు పంపిణీ చేశారు. వరద బాధితులకు అండగా ఉంటామన్నారు. వీఆర్వోలు శ్రీనివాసులు, జగదీష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.